క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

నందిగామ: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి ఆలయ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పి.సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అమ్మవారి ఆలయ 21 వ వార్షికోత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీన హనుమత్ జయంతి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

10 గ్రామాలకు ఎంపీ కేశినేని వాటర్ ట్యాంకర్లు

కంచికచర్ల: వేసవికాలంలో గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) వాటర్ ట్యాంకర్లను అందజేస్తున్నట్లు ఎంపీడీఓ కె.బాలశంకరరావు గురువారం తెలిపారు. ఈ ట్యాంకర్ల ద్వారా వీధుల్లోకి వెళ్లి ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా గ్రామ పంచాయితీ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మండలంలో 10 వాటర్ ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రమైన కంచికచర్లకు -2, మండలంలోని పరిటాల, చెవిటికల్లు, కునికెనపాడు, ఎస్.అమరవరం, వేములపల్లి, కీసర, గండేపల్లి, మోగులూరు గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీరులపాడు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని జగన్నాధపురం గ్రామంలో గురువారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు కంచికచర్లకు చెందిన సూదుల వెంకటేశ్వరరావు కంచికచర్ల నుంచి ద్విచక్ర వాహనంపై మండలంలోని జుజ్జూరు గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జగన్నాధపురం గ్రామ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో వెంకటేశ్వరరావుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆస్పత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నందిగామ: వివాహిత అదృశ్యంపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం వత్సవాయి మండలం చినమోదుగపల్లికి చెందిన ఓ వివాహిత నందిగామ మండలం చెరువుకొమ్మువారి పాలెం గ్రామంలోని వాళ్ల అమ్మమ్మ ఇంటికి వచ్చింది.ఆ తరువాత కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు.

మండల పరిషత్ సమావేశం నేడు

కంచికచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం పాలన

గడప గడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెద్దాపురం గడపగడపలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నాలుగేళ్లుగా అవినీతికి తావులేని పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు.

అగ్రవర్ణ మహిళలకూ సంక్షేమ పథకాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణ మహిళలకు సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని జగన్‌మోహనరావు తెలిపారు. గత ప్రభుత పాలనలో గ్రామీణ ప్రాంతాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గ్రామ పంచాయతీ భవనాలు కూడా లేని దీన స్థితిలో గ్రామీణ ప్రాంతాలు కునారిల్లాయని ఆయన గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గ్రామాల్లో సచివాలయ భవనాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

అన్నార్తులకు ఆత్మీయ స్వాగతం

ఇప్పటి జనరేషన్‌కు తెలియకపోవచ్చేమో కానీ, మిలీనియంకు ముందు పుట్టిన తరం వారందరికీ పేదరాశి పెద్దమ్మ కథ తెలిసే ఉంటుంది. సంపాదన కోసం కాకుండా సేవే పరమావధిగా బాటసారుల కడుపు నింపే పెద్దమ్మ కథ వినే ఉంటారు. పేదరాశి పెద్దమ్మలాగానే నందిగామలో మల్లారెడ్డి, భద్రకాళీదేవి దంపతులు అరుణాచలేశ్వరుని స్ఫూర్తితో ఆరేళ్లుగా కనీస ధరకు భోజనం అందజేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.



బాటసారుల కోసం భోజనం తయారు చేస్తున్న మల్లారెడ్డి, భద్రకాళీదేవి దంపతులు



ఆత్మీయంగా పలకరిస్తూ భోజనం వడ్డిస్తున్న మల్లారెడ్డి



భోజనం ధర తెలుపుతున్న బోర్డు

నందిగామ: సేవే పరమావధిగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణానికి చెందిన దంపతులు నిత్యం వందలాది మందికి ఆత్మీయ భోజనం వండి వడ్డిస్తున్నారు. బాటసారుల కడుపు నింపాలన్న ఆలోచనతో వారు ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నందిగామకు చెందిన దుర్గెంపూడి మల్లారెడ్డి సివిల్ కాంట్రాక్టర్, ఆయన భార్య భద్రకాళీదేవి. తమకున్న దానిలో పది మందికి సేవ చేయాలన్నదే వీరి లక్ష్యం. ఈ నేపథ్యంలో వారు 2018లో తమిళనాడులోని అరుణాచలం వెళ్లారు. అప్పటి నుంచి అరుణాచలేశ్వరుని స్ఫూర్తితో అన్నదానం రూపంలో సేవలందించాలని సంకల్పం తీసుకున్నారు. ప్రతిరోజు బాటసారులకు, పేదవాళ్లకు భోజనం తయారు చేసి పంపిణీ చేసేవారు. ఆ తర్వాత బాటసారుల కోసం ఉచిత అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉచితం కావడంతో పెద్దగా ఎవ్వరూ భోజనానికి వచ్చే వాళ్లు కాదు. దీంతో ఈ ఏడాది జనవరి 23న బస్టాండ్ సమీపంలో వారు నివాసం ఉంటున్న ఇంట్లోనే కేసరి శాఖాహార భోజనశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి పప్పు, కూర, చట్నీ, సాంబార్, స్వీటు, పులిహోర, మజ్జిగతో కూడిన ఫుల్ భోజనాన్ని (తిన్నంత) కేవలం రూ.39కే అందిస్తున్నారు. ప్రస్తుతం రోజూ వంద మందికి పైగా బాటసారులు ఇక్కడ ఆకలి తీర్చుకుంటున్నారు. ఆ దంపతులు బయట నుంచి కావాల్సిన సరుకులు, కూరగాయలు తెచ్చుకుని, మడితో కూడిన వంటను తయారు చేసి బాటసారులకు ఎంతో ఆప్యాయతగా వడ్డిస్తున్నారు. శుచి, శుభ్రతతో కూడిన భోజనం అతి తక్కువ ధరకే లభిస్తుండడంతో ఈ సమాచారం ఒకరి నుంచి మరొకరికి తెలిసి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలోనూ రూ.39 కే తిన్నంత భోజనం పెడుతుండడంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వాళ్లు చేస్తున్న సేవకు స్పందించి కొందరు రోజూ వచ్చి వారికి ఉచితంగా సేవలందిస్తున్నారు.

చక్కటి ఇంటి భోజనం



నేను నందిగామకు ఏ పని మీద వచ్చినా ఇక్కడే భోజనం చేస్తాను. శుచి, శుభ్రతతో కూడిన చక్కటి ఇంటి భోజనం వడ్డిస్తున్నారు. నాలాగానే నిత్యం అనేక మందికి ఇక్కడ భోజనం అందజేస్తున్నారు.

– పి.సూర్య సత్యనారాయణ, ఎస్.అమరవరం, కంచికచర్ల మండలం

ఇది భగవంతుడి సంకల్పం



ఆ భగవంతుడి దయవల్ల నేను సివిల్ కాంట్రాక్టర్‌గా చేసి స్థిరపడ్డాను. ప్రస్తుతం సేవా కార్యక్రమాలలో భాగంగా ఆకలితో ఉన్న వాళ్ల కడుపు నింపాలన్న ఉద్దేశంతో రూ.39కే భోజనాన్ని అందిస్తున్నాం. ఇది ఆ భగవంతుడి సంకల్పం.

– దుర్గెంపూడి మల్లారెడ్డి, నందిగామ

ఉత్సాహంగా కొనసాగుతున్న ఎడ్ల ప్రదర్శన

నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండ లాగుడు ప్రదర్శన ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి జూనియర్ ఎడ్ల జతల విభాగంలో పోటీలు నిర్వహించారు. 20 క్వింటాళ్ల బరువున్న రాయిని 20 నిమిషాల వ్యవధిలో లాగిన దూరాన్ని బట్టి విజేతలను నిర్ణయిస్తారు.ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ ప్రదర్శన రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది.



రేపు జాతీయ లోక్ అదాలత్

జగ్గయ్యపేట అర్బన్: సుప్రీం కోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశానుసారం ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జగ్గయ్యపేట లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి తెలిపారు. ఈ వివరాలను ఆమె గురువారం విలేకరులకు తెలిపారు. జగ్గయ్యపేట కోర్టు పరిధిలో కేసులు కలిగిన కక్షిదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని రాజీ అనే రాజ మార్గంలో తమ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

నాటి పాపాలు.. నేడు ప్రజలకు శాపాలు

- లెవలింగ్ లేకుండా స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం
- కమీషన్ల కోసం నాటి టీడీపీ పాలకుల కక్కుర్తి
- నిబంధనలు తుంగలో తొక్కిన వైనం
- నరకయాతన అనుభవిస్తున్న నగరవాసులు
- ఎక్కడికక్కడే వర్షపు నీరు నిల్వ



పూడిక తీసేందుకు డ్రెయిన్‌పై శ్లాబును పగులగొట్టిన దృశ్యం

పటమట(విజయవాడతూర్పు): టీడీపీ హయాంలో అప్పటి నగర పాలక సంస్థ సభ్యులు చేసిన పాపాలు నేడు ప్రజలకు శాపాలుగా మారాయి. కమీషన్లకు కక్కుర్తిపడి నిబంధనలు తుంగలో తొక్కి స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణాలు నాసిరకంగా చేపట్టారు. నాణ్యతకు పాతరేసి ఎక్కడా సాంకేతిక అంశాలు పట్టించుకోకుండా డ్రెయిన్లు నిర్మించి చేతులు దులుపుకొన్నారు. దీని వల్ల ఇప్పుడు నగరవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొందరు చిన్నారులు డ్రెయిన్లలో పడి మృతి చెందడానికి అప్పటి టీడీపీ పాలకులే కారణమని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. నగరంలో వర్షపు నీటి దారి మళ్లింపునకు డ్రెయిన్ల నిర్మాణానికి అమృత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విజయవాడ నగర పాలక సంస్థకు 2016లో రూ.485 కోట్లు కేటాయించింది. కానీ ఆనాటి పాలకులు ఆ నిధులను అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధికి మళ్లించారు. కేవలం రూ.140 కోట్లతో తూతూమంత్రంగా డ్రెయిన్లు నిర్మించారు. 64 డివిజన్లలో మైనర్, మేజర్, అవుట్‌ఫాల్ డ్రెయిన్లు అసంపూర్తిగా వదిలేశారు. దీని వల్ల నేడు నగర వాసులు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. దీనిపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రస్తావించగా డ్రెయిన్ల మరమ్మతులకు గాను సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మూడు నియోజకవర్గాలకు రూ. 22 కోట్లు నిధులు వెచ్చించనున్నామని వీఎంసీ అధికారులు ప్రకటించారు.

అస్తవ్యస్తంగా స్టామ్ వాటర్ డ్రెయిన్లు

వర్షాలు కురిస్తే నగరంలో డ్రెయిన్లు అతి పెద్ద సమస్యగా మారాయి. టీడీపీ హయాంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన డ్రెయిన్లు ప్రస్తుతం ఎందుకూ పనికి రాకుండా పోయాయి. వర్షం నీరు పారకపోగా అందులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కళ్యాణవేదిక వద్ద ఆరేళ్ల చిన్నారి అభిరామ్ మృతి చెందిన ఘటన తెలిసిందే. ఇందుకు టీడీపీ పాలకుల కమీషన్ల కక్కుర్తే కారణం. లెవలింగ్ లేకుండా జరిగిన స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణానికి అప్పటి కార్పొరేషన్ పాలక వర్గం ఎల్‌అండ్‌టీకి వత్తాసు పాడగా నేడు ఆ సమస్యను నగరవాసులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎగుడుదిగుడుగా ఉన్న ఆ డ్రెయిన్ల నుంచి వర్షం నీరు పారకపోగా నీరంతా రోడ్డుపై చేరి రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. రెసిడెన్షియల్ జోన్‌లో నిర్మించే డ్రెయిన్ల నుంచి మైనర్, మేజర్ డ్రెయిన్ల వరకు అప్పట్లో స్థానిక కార్పొరేటర్లు వారి డివిజన్లలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు పొందారని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. దీనిపై 2017, 2018, సంవత్సరాల్లో జరిగిన ప్రతి కౌన్సిల్ సమావేశాల్లో సొంత పార్టీ నేతలు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో చాలా ప్రాంతాల్లో ఈ డ్రెయిన్లను అసంపూర్తిగా వదిలేయటం, లెవలింగ్ లేకపోవటంతో నీరు ముందుకు కదలక నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. చాలా ప్రాంతాల్లో డ్రెయిన్లపై అనధికారికంగా చప్టాలు, కల్వర్టులు నిర్మిస్తుండగా పూడిక తీసే సమయంలో సమస్య మరింత జటిలంగా మారుతోంది. మాన్యువల్ స్కావెంజర్స్‌పై నిషేధం ఉండటంతో పూడిక తొలగింపునకు యంత్రాలను వినియోగిస్తున్నారు. పూర్తిగా మూసేసిన డ్రెయిన్లలో పూడిక తొలగింపునకు ఇవి అడ్డంకిగా మారుతున్నాయి. దీనిపైకూడా వీఎంసీ దృష్టి సారించింది.

యాక్షన్‌ప్లాన్‌కు సిద్ధం

నగరంలో చాలా ప్రాంతాల్లో స్టామ్ వాటర్ డ్రెయిన్లపై బిల్డర్లు అనధికారికంగా చప్టాలు, వంతెనలు, మూతలు వేస్తున్నారు. దీనిపై వీఎంసీ దృష్టి సారించింది. డ్రెయిన్ల వెంబడి కొత్తగా నిర్మించే అపార్టుమెంట్ల పూడికను సంబంధిత అపార్టుమెంట్ స్థలంలోనే వేరుచేసి అక్కడి నుంచి తరలించేలా నూతనంగా డిజైన్‌లను వీఎంసీ పరిశీలిస్తుంది. దీనిపై నిపుణులతో నగర పర్యటన నిర్వహించి సాధ్యాసాధ్యాలను ప్రాక్టికల్‌గా పరిశీలించి నగర వ్యాప్తంగా అమలు చేయటానికి అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.

డ్రెయిన్లపై మూతలు వేయవద్దు

నిబంధనల ప్రకారం స్టామ్‌వాటర్ డ్రెయిన్లపై మూత వేయకూడదు. వాటిలో నిరంతరం పూడిక తీయాల్సి ఉంటుంది. దీనికి తోడు వర్షం వచ్చినప్పుడు మురుగు ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. రోడ్లపై నీరు డ్రెయిన్లలోకి వెళ్లే విధంగా రూపొందించిన ఈ డ్రెయిన్లు మూసేస్తే ప్రజలకు మరింత ఇబ్బందులు వస్తాయి. ఇటీవల జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని భద్రతపై కూడా వీఎంసీ దృష్టి సారించనుంది. అందుకు అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం.

–స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, కమిషనర్, వీఎంసీ

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



స్వామివారిని దర్శించుకుని పూజాకార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వవిప్ ఉదయభాను

పోలంపల్లి(వత్సవాయి): గ్రామంలో వేంచేసిన శ్రీ సీతారామ, లక్ష్మణ సమేత భక్తాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ కనుల పండువగా స్వామి వార్ల విగ్రహాలను, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణం సంతరించుకుంది. ప్రతి ఇంటా బంధుమిత్రుల సందడి నెలకొంది. స్వామి వారిని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఎస్ఐ అభిమన్యు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కాటేపల్లి రవిరామతులసి, సర్పంచ్ మాదుగుల లాజర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా, శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యం

- 10 మంది అంగన్‌వాడీ సిబ్బంది నియామకం
- నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్సీ అరుణకుమార్



నియామక పత్రాలు అందుకున్న వారితో ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: మహిళా శిశు సంరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన అంగనవాడీ సిబ్బందికి గురువారం రాత్రి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచటంతో పాటు ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అంగనవాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అభివృద్ధి చేసి విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారని గుర్తు చేశారు.

విధిగా పౌష్టికాహారం అందించాలి..

అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాలని జగన్‌మోహనరావు అన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలు, గుడ్లతో పాటు రాగిజావను సైతం అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన సూచించారు. మహిళా, శిశు సంరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, సిబ్బంది కూడా అందుకనుగుణంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

10 మందికి నియామక పత్రాలు

నందిగామ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలలో నూతనంగా 10 మంది అంగన్‌వాడీ సిబ్బందిని నియమించినట్లు సీడీపీవో భాగ్యరేణుక తెలిపారు. వీరికి ఎమ్మెల్సీ అరుణకుమార్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో కృష్ణకుమారి, సీనియర్ అసిస్టెంట్ జెస్సి, పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తక భాండాగారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కంచికచర్ల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



పేట గ్రంథాలయంలో డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంచికచర్ల: వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో నాల్గవరోజు గురువారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రుడు మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ఈ కార్యక్రమాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, బొమ్మల తయారీ, డ్రాయింగ్ తదితర అంశాల్లో గురువారం శిక్షణ ఇచ్చారు. తెలుగు ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు తెలుగు వ్యాకరణంలో వర్ణమాల గురించి వివరించారు. చిత్రకారుడు చంద్రశేఖర్ చిత్రలేఖనం నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది జె.శ్యామల, సత్యావతి పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

వేసవి శిబిరాలతో విజ్ఞానం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి ఇంజం మధు పేర్కొన్నారు. వేసవి శిబిరంలో భాగంగా గురువారం అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం, కార్టూన్లు వేయడంలో శిక్షణ ఇచ్చారు.

మహా యజ్ఞం ఏర్పాట్లు పరిశీలన



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహా యజ్ఞానికి పక్కా ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం స్టేడియం ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, టాయిలెట్స్, మంచినీటి కౌంటర్ల ఏర్పాట్లపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు మహా యజ్ఞం నిర్వహిస్తున్నారన్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఆ కార్యక్రమంలో వీఎంసీ సిబ్బంది ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావు, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) శకుంతల, జోనల్ కమిషనర్-2 యు.సృజన తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో గత రెండు రోజులుగా భానుడి ప్రతాపానికి తోడు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది.